# ఆగమాగం ఓటేస్తే రైతు బతుకు ఆగమే!





## కాంగ్రెస్ తీరుతో దళారీ వ్యవస్థకు దారులు

**- నాగంపెల్లి కిరణ్, రైతు, రేలకుంట**

నల్లబెల్లి : కాంగ్రెసోళ్లు అంటున్నట్లు ధరణి తీసేస్తే మళ్లా దళారీ వ్యవస్థకు దారులు తెరిసినట్లే అవుతుంది. గత పాలకుల నియంతృత్వ పోకడల వల్ల సామాన్యుడు తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరిగినా భూముల సమస్య పరిష్కారం కాకపోతుండే. బ్యాంకు రుణాల కోసం అప్పటి వీఆర్వోలు ఒకరి భూమి మరొకరికి రాసి పహాణీ నకల్లు ఇచ్చేవారు. దీంతో అమాయకులైన కొందరు రైతుల భూములను మరొకరు పట్టాలు చేసుకున్న సందర్భాలు ఉన్నాయి. భూముల సమస్యలపై పోలీస్‌స్టేషన్ల చుట్టూ, కోర్టుల చుట్టూ తిరిగేటోళ్లం. చేయి తడపందే తహసీల్ కార్యాలయంలో పని కాకపోయేడిది. తెలంగాణ రాష్ట్రం వచ్చినంక సీఎం కేసీఆర్ సార్ ధరణి తీసుకు వచ్చి భూములకు భద్రత కల్పించారు. ఇప్పుడు ఏ కొట్లాటలు లేవు. రైతులు హాయిగా ఎవుసం చేసుకుంటాన్రు. అర చేతిలోనే భూమి వివరాలు తెలుత్తానై. దళారీ వ్యవస్థ దూరమైంది. ఐదు నిమిషాల్లో భూములు రిజిస్ట్రేషన్ అయితానయ్. గతంలో సావుకారి కాడ అప్పులు తెచ్చి పంట పెట్టుబడులు పెట్టేటోల్లం. వచ్చీరాని కరెంటుతో అట్టకట్టాలు పడ్డాం. మోటర్లు ఎప్పటికి కాలిపోతుండేది. వేరే అయ్యకాడ మళ్లా అప్పు తెచ్చి మోటర్లు సగబెట్టిచ్చేది. పండిన పంట అమ్మితే వచ్చే పైసలు అప్పులోనికే దారపోసేది. పిల్లల చదువులు చదివించలేక కుటుంబం గడువక తిప్పల పడ్డం. మా బాధలు తెలుసుకుని పెద్ద సార్ అదునుకు రైతు బంధు ఇవ్వడంతో ఇప్పుడు అప్పులు తెత్తలేము. మాకాడ ఎక్కువ మిరప తోటలు పండిత్తం. అప్పుడు రాత్రి పూట పంటలకు నీళ్లు పెట్టేందుకు వెళ్లేటోళ్లం. మా ఊళ్లో ఇద్దరు ముగ్గురు రాత్రి చేనుకాడికి పోతాంటే పాము కర్చి సచ్చిపోయారు. కొందరు కరెంటు షాకు తగిలి సచ్చిపోయారు. అయినా పంట తీయాలే అప్పులోడికి పైసలు కట్టాలె కాబట్టి టార్చ్‌లైట్లు పట్టుకుని చేన్లకాడికి పొయేటోళ్లం. నిద్ర మానుకొని కరెంటు కోసం ఎదురు చూసెటోళ్లం. మళ్లా లోవోల్టేజీతో కరెంటు వచ్చేది. దీంతో ఊకె కరెంటు టిప్పు అయితుండె. రాత్రంతా మేల్కతోని ఉంటే 10 గుంటల చెల్క కూడా తడువక పోయేటిది. ఇప్పుడు 24 గంటల కరెంటు ఇత్తాంద్రు. 3 హెచ్‌పీ, 5 హెచ్‌పీ మోటర్లనే వాడుతానం. ఈ మోటర్లకు ఆటోమేటిక్ స్టాటర్లు పెట్టుకుంటే అదే ఎత్తుకుంటది అదే ఆఫ్ అయితది. ఇంట్ల ఉన్నా పొలాలు పారుతానై.. పంటలు మంచిగా పండుతానై. పిండి బత్తాలు, మందులు అదునుకు దొరుకుతానై. కల్తీ లేని విత్తనాలు దొరుకుతానై. రంది లేకుండా ఎవుసం చేత్తానం. మళ్లా కాంగ్రెసోళ్లు 3 గంటల కరెంటు ఇత్తానంటాంద్రు. 10 హెచ్‌పీ మోటర్లు పెట్టిత్తామంటాంద్రు. ఇలా రైతులు అందరు ఒక్కసారే మోటర్లు పెడితే ట్రాన్స్‌ఫార్మర్లు ఆగుతాయా.. సబ్‌స్టేషన్లు కాలిపోవా.. నట్టం ఎవడు బరిస్తడు.. మళ్లా రైతులపైనే భారం ఏత్తరు.. గిప్పుడుగిప్పుడే నాల్గు పైసలు ఎనకేసుకుంటానం.. కాంగ్రెసోళ్లు మా బతుకులను ఆగం చేసేందుకే కంకణం కట్టుకున్నట్టుంది. రైతులందరం కూడగట్టుకుని ఈ ఎన్నికల్లో ఓట్లతో బుద్ధి చెప్పుడు ఖాయం. నీళ్లిచ్చి, పెట్టుబడి ఇచ్చి మమ్ముల ఆదుకుంటున్న కేసీఆర్ సార్‌కే అండగా ఉంటాం. మందిని ముంచే కాంగ్రెస్‌కు బుద్ధి చెప్తం.

## పాస్ బుక్కుల కౌలుదారు కాలమ్ ఎందుకు?

**- చల్లా రవీందర్‌రెడ్డి, రైతు, కేశవాపూర్**



ఎల్కతుర్తి : మన సొంత పాస్ పుస్తకాల్లో భూ యజమాని పేర్లు ఉంటయ్ కానీ మళ్ల గీ కౌలు దార్ల పేర్లు ఎట్ల పెడుతరు. ఎన్కటనే పాస్ పుస్తకాల్లో అనుభవదారు, కౌలుదారు అని రెండు పేర్లు ఉంటనే తలకాయనొప్పులు వచ్చినయ్. అప్పుడున్న కొందరు రెవెన్యోళ్లు అటు పేరు ఇటు, ఇటు పేరు అటు రాసి మస్తు ఆగం జేసిన్రు. పేర్లు మార్చ్వడానికి ఆఫీసుల చుట్టు తిరిగీతిరిగి చెప్పులరిగేటియి. పహాణీల్లో పెన్సిళ్లు, పెన్నులతో రాసి కొట్టేసేవారు. మళ్ల పైసలిస్తేనే పనులయ్యేటియి. గిప్పుడు అలాంటి సమస్యలేమీ రైతులకు లేవు. నిజంగా ఇదివరకు రైతుల ఇబ్బందులు తెలిసిన వాళ్లెవరు గిట్ల మాట్లాడరు. ఒకవేళ అదే జరిగితే కొట్లాటలు తప్పయ్. భూములు కౌలుకు ఇచ్చేందుకు ఎవరూ ముందుకు రారు. ధరణి మంచిగనే ఉన్నది. మా హక్కులకు ఎలాంటి రంది లేదు. పేరు మార్చి కొత్తగా పెడితే ఏమొస్తదో కాంగ్రెసోళ్లకే తెల్వాలి.

## రైతుల సంక్షేమం కోసమే ధరణి

**-మామిడి రవీందర్ యాదవ్, రైతు, శాయిపేట**



ధర్మసాగర్ : రైతుల సంక్షేమమే సీఎం కేసీఆర్ లక్ష్యం. ఆయన స్వయంగా రైతు. రైతుల కష్టాలు తెలుసు. ధరణి ద్వారానే భూములకు రక్షణ. ఎప్పుడో తాతల నాటి కాలంలో తెల్ల పేపర్ మీద రాసుకుని భూమి కొంటే దానిని సాదాబైనామా పేరిట ధరణి పోర్టల్లో ఎక్కించి పట్టాదారు పాస్ బుక్కులు ఇచ్చిండు. ధరణి వల్లే రైతులకు భూములపై హక్కులు వచ్చినయ్. దీన్ని తీసి కాంగ్రెసోళ్లు భూమాత తీసుకువస్తామని చెప్పడాన్ని రైతుగా నేను వ్యతిరేకిస్తున్నా. అయినా వారు అధికారంలోకి రారు. ముఖ్యంగా తెలంగాణ పట్టాదారు పాసుబుక్కు రావడంతో భూమిపై హక్కులు వచ్చినయ్. ఇంట్లో భూమి సమస్యలు తీరినయ్. ఏ కుటుంబంలోనైనా భూమి అమ్ముకోవాలన్నా, కొనుగోలు చేసుకోవాలన్నా ఇద్దరు ఉంటేనే సరిపోతది. అంతే కాకుండా వేలు ముద్ర పెడితేనే ఆ భూమి వివరాలు ఓపెన్ అయి వేరే వారికి అమ్మినట్లు తెలుస్తుంది. మళ్లీ కేసీఆరే రావాలే. కాంగ్రెస్ వస్తే పాత పద్ధతిలో మళ్లీ భూమి సమస్యలు వస్తయ్. ధరణిని తొలగించవద్దు.

## ధరణిని రద్దు చేస్తామంటే రణమే..

**- మాలోత్ దేవేందర్‌నాయక్, రైతు, ఈదులతండా**



రాయపర్తి : ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రతిష్టాత్మకంగా తీసుకు వచ్చిన ధరణి పోర్టల్‌తో రాష్ట్రంలోని రైతులందరికీ ఎంతో మేలు జరుగుతున్నది. ఈ పోర్టల్ రాకతో రెవెన్యూ వ్యవస్థలోని వీఆర్వోలు, వీఆర్ఏలకు మంగళం పాడడంతో రైతాంగానికి ఇప్పుడు ఎటువంటి భూ సమస్యలు ఉత్పన్నం కావడం లేదు. ఆనాడు వీఆర్వోలు, వీఆర్ఏలు ఉన్న సమయంలో రైతులు, పట్టాదారుల రెవెన్యూ రికార్డులను తారుమారు చేస్తూ కరెక్షన్‌ల పేరుతో కరప్షన్ చేస్తూ వేలాది రూపాయలు దండుకునేవారు. ధరణిని తీసివేస్తే మళ్లీ రాష్ట్ర రైతాంగాన్ని నట్టేట ముంచినట్లే అవుతుంది. రైతాంగానికి సహాయకారిగా ఉన్న ధరణి పోర్టల్‌ను ఎత్తివేస్తామంటే ఆగ్రహించక తప్పదు.

## ధరణితో లొల్లులు బందైనయ్..

**- సుద్దపల్లి సులోచన, రైతు, యాదవనగర్**



హనుమకొండ సిటీ : ధరణి అమల్లోకి వచ్చినప్పటి నుంచి భూమి విషయంలో లొల్లులు మాయమైనయ్. భూమి కొనుగోలు, అమ్మకాల విషయంలో దళారీ వ్యవస్థ లేకుండా నేరుగా తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి రిజిస్ట్రేషన్ చేసుకునే స్వేచ్ఛ వచ్చింది. గతంలో తహసీల్దార్, వీఆర్వోలకు లంచాలు ఇచ్చి కాళ్లు అరిగేలా తిరిగినా పని కాకపోయేది. ఇప్పుడు ధరణిని తీసుకువచ్చి సీఎం కేసీఆర్ మంచి పని చేశారు. భూముల దగ్గర కిరికిరి అనే మాటే లేకుండా చేశారు. రానున్న రోజుల్లో అసైన్డ్ ల్యాండ్‌కు పట్టాలు ఇస్తానని చెప్తున్నారు. చాలా సంతోషకరమైన విషయం. కౌలు రైతుకు హక్కు కల్పిస్తామనడం దుర్మార్గమైన ఆలోచన. ఈ ఒక్క ఆలోచనతో కాంగ్రెస్‌ను రైతులు బొందపెట్టక తప్పదు. కాంగ్రెస్ వాళ్లు పబ్బం గడుపుకోవడానికి పాత రోజులను తీసుకొచ్చి రైతులను ఆగం చేయాలని చూస్తున్నారు.

## రైతుల మధ్య గొడవలు తప్పవు

**- ఉండీల రాజు, రైతు, నర్సానగర్**



సంగెం : కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రైతు కౌలుకు ఇస్తే హామీ పత్రం రాసుకునేందుకు చట్టం తెస్తామనడం ఇద్దరి మధ్య గొడవలు పెట్టియ్యడమే. రైతు ఇష్టపూర్వకంగా కౌలుకు ఇవ్వాలే తప్ప ఇందుకోసం చట్టం చేస్తామంటే అసలు రైతు కౌలుకు ఇచ్చే పరిస్థితి ఉండదు. రాతపూర్వకంగా ఇస్తే చట్టపరంగా హక్కులు పొందుతాడు కాబట్టి ఇరువురి మధ్య గొడవలు, పంచాయితీలు అయి కోర్టుల వరకు పోయే ప్రమాదం ఉంది. చట్టం తీసుకురావడం వల్ల రైతులు ఇబ్బందులు పడుతారు. ధరణి పోర్టల్‌లో ప్రతి రైతు భూమిని ఆన్‌లైన్‌లో చూసుకోవచ్చు. రైతు భూమి కొన్నా.. అమ్మినా.. ఫింగర్ ప్రింట్ పెడితేనే పని అయితది. దీంతో రైతుకు భూమి మీద ఎలాంటి అపోహలు లేకుండా నిర్భయంగా ఉంటాడు. ధరణి ఉంటేనే రైతులకు శ్రేయస్కరం.

## ధరణి తీసేస్తే ఆగమాగమే..

**- తోట సాంబయ్య, రైతు, ఆత్మకూరు**

ఆత్మకూరు : తెలంగాణ ఉద్యమ నేత, సీఎం కేసీఆర్ రైతుల కోసం ధరణి పోర్టల్ తీసుకువచ్చి భూములకు భద్రత కల్పించారు. ధరణి తీసేస్తే రైతులు ఆగమాగం కావడం ఖాయం. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో పటేల్, పట్వారీ వ్యవస్థలో దొంగ రిజిస్ట్రేషన్లు చేసింద్రు. రెవెన్యూ రికార్డుల్లో గోల్‌మాల్ చేసి రైతులను మోసం చేశారు. ప్రస్తుతం ధరణి ద్వారా భూమి ఉన్న ప్రతి రైతుకు పట్టాదారు పాస్ పుస్తకం ఇప్పించారు. పెట్టుబడి కోసం రైతుబంధు ప్రవేశపెట్టి బ్యాంకు ఖాతాల్లో డబ్బులు వేస్తున్నారు. గత ప్రభుత్వాలు ఏ రోజు రైతుల కోసం ఆలోచించలేదు. రైతుల కష్టసుఖాలు తెలుసుకున్నది సీఎం కేసీఆర్ ఒక్కరే. గ్రామాల్లోకి వచ్చే కాంగ్రెసోళ్ల మాయ మాటలు వింటే మళ్లీ కష్టాలు మొదలైనట్లే. 24గంటల కరెంటు ఉండడం వల్ల ఎంతో సంతోషంగా వ్యవసాయం చేసుకుంటానం. 3గంటల కరెంటు ఇస్తే, వ్యవసాయం చేయడం దండుగ. పచ్చని పొలాలు బీడు భూములుగా మారుతాయి. అప్పుడప్పుడు కరెంటు ఇస్తే బావుల వద్ద జాగారాలు చేయాల్సిందే. రైతులకు కరెంటు కష్టాలు ఉండవద్దనే సీఎం కేసీఆర్ 24గంటల కరెంటు ఇచ్చి రైతులను ఆదుకుంటున్నారు. రైతులను ఆగం చేయాలనే చూస్తే ఊరుకునే ప్రసక్తి లేదు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఓటుతో దెబ్బకొడతాం.



## ధరణి లేకుంటే భూ రికార్డులు గల్లంతే..

**- కన్నెబోయిన సతీశ్, రైతు, దామెర**



దామెర : ధరణి తీసేస్తామని కాంగ్రెస్ చెబుతున్న తీరు చూస్తే రైతుల వ్యవసాయ భూముల రికార్డులు తారుమారై ఆగం అయ్యే పరిస్థితి ఉంటది. దళారులు పుట్టుకొస్తరు. మళ్లీ పాతగొడవలే. ఇదేం బాగా లేదు. ధరణి తీసేసి గ్రామాల్లో రైతుల మధ్య గొడవ పెట్టాలని కాంగ్రెస్ నాయకులు చూస్తున్నరు. ఇది మంచి పద్ధతి కాదు. సీఎం కేసీఆర్ తీసుకువచ్చిన ధరణి వల్ల రైతులు తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లిన రెండు నిమిషాల్లోనే రిజిస్ట్రేషన్ జరుగుతున్నది. రైతుకు తెలియకుండా వ్యవసాయ భూమికి సంబంధించిన ఏ రికార్డూ మారదు. నయా పైసా లంచం ఇవ్వనవసరం లేదు. ఇలాంటి ధరణిని కాంగ్రెస్ నాయకులు తీసివేస్తామని చెప్పడం చూస్తే మళ్లీ రైతులకు పాతకాలపు కష్టాలే.. ఎట్టి పరిస్థితిల్లో దీన్ని మేం ఒప్పుకోం.. కాంగ్రెస్‌కు తగిన బుద్ధి చెబుతాం.